క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

భాకరాపేట: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనితావాణి తెలిపారు. యడమవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లులు, గర్భిణులు, బాలింతలు, చంటి బిడ్డలు, కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

అలరించిన ఉత్తర గోగ్రహణం

రామచంద్రాపురం: మండలంలోని ఎస్‌ఆర్‌కమ్మపల్లిలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజులు ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో శుక్రవారం భాగవతారిణి సీతాలక్ష్మీ ఆలపించిన ఉత్తర గోగ్రహణం హరికథా గానం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా లెక్కల రాజేందర్‌నాయుడు, శంకరమ్మ కుమార్తె శ్రీదేవి వ్యవహరించారు. పుల్లమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన మధుసూదన నాయుడు, పార్వతమ్మ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, అర్చకులు హరిఆచారి భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉత్తమ అధ్యాపకులకు అభినందనలు


ఉత్తమ అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు డీఎం మమత, రజిత, శైలేశ్వరి ఈ నెల 5న విశాఖలో ఉత్తమ అధ్యాపక అవార్డులు అందుకున్నారు. వారిని శుక్రవారం వీసీ భారతి, రిజిస్ట్రార్ రజనీ అభినందించారు.

ఉపాధిహామీ బహిరంగ సభ

పాకాల: స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై ఆడిట్ నిర్వహించారు. మండలంలో రూ.63.80 లక్షల పనులు జరిగినట్లు గుర్తించారు. ఇందులో రూ.26,500 రికవరీ చేసినట్టు ఉపాధి హామీ పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. జెడ్పీటీసీ నంగా పద్మజా రెడ్డి, ఉపాధి హామీ అంబుడ్స్‌మన్ రాసరాయ నాయుడు, డీవీవో భాగ్యలక్ష్మి, క్లస్టర్ ఏపీడీ సీహెచ్ పద్మలత పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



తిరుపతి రూరల్: తిరుచానూరులోని నవజీవన్ ఆశ్రమంలో ఉన్న అంధులు, వృద్ధులకు శుక్రవారం సేవాజ్యోతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వసంత దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. నవజీవన్ వ్యవస్థాపకులు శ్రీధర్ ఆచార్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి జేసీఐ వారోత్సవాలు

తిరుపతి కల్చరల్: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు జేసీఐ తిరుపతి అధ్యక్షుడు గుణశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వారోత్సవాల సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపులు, నీటి పరిరక్షణ, రోడ్డు భద్రత, మొక్కల నాటడం తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. అలాగే అన్నదానం చేస్తామని, ధూమపానం, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

తిరుపతి కల్చరల్: ప్రతి రోజూ వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ రేవంత్ తెలిపారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాస్ సేవా నిలయంలో బుద్ధి మాంద్య పిల్లలు 60 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. డాక్టర్లు చరణ్, స్పందన పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు..

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లె సమీపంలో శుక్రవారం కారు అదుపుతప్పి ఇనుప రెయిలింగ్‌ను ఢీకొనడంతో ఆరుగురు గాయపడ్డారు. తిరుపతికి చెందిన వారు కారులో వస్తుండగా కుక్క అడ్డుగా రావడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించినట్లు ఎస్‌ఐ హిమబిందు తెలిపారు.

హత్య కేసులో నలుగురి అరెస్ట్

పీలేరు రూరల్: పీలేరు పట్టణం కోటపల్లె బాలికల ఉన్నత పాఠశాల వద్ద గత నెల 31న ఇందిరమ్మ కాలనీకి చెందిన సుధాకర్‌ను విషంతో కూడిన సూదులతో గుచ్చి హత్య చేసిన కేసులో మరో నలుగురు నిందితులను తిరుపతిలో అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం గోవిందపురానికి చెందిన తమ్మినేని రవికుమార్ (41), తిరుపతి టౌన్ ప్రకాశం రోడ్డులో ఉంటున్న కారుపర్తి భానుచందర్ (32), కృష్ణా జిల్లా బాపులుపాడు హనుమాన్ జంక్షన్‌కు చెందిన షేక్ మహ్మద్ హనీఫ్ (39), గుంటూరు జిల్లా మంగళగిరి తిప్పలబజార్‌కు చెందిన షేక్ సలీమ్ (60) ఉన్నారు.



ఆకలి మనిషి చేత ఎంతటి సాహసాన్నైనా చేయిస్తుంది. అది ప్రమాదకరమైనా వెనుకంజ వేయరు. తిరుపతి హరేరామ హరేకృష్ణ ఆలయం రోడ్డులో చిన్నారులు తాడుపై నడుస్తూ విన్యాసాలు చేశారు. తలపై బిందెలు పెట్టుకుని నడుస్తూ చూపరులను అబ్బురపరిచారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం


పాత ఆలయాన్ని యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎలమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులను అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఆలయం వందల ఏళ్ల కాలం నాటిది. భక్తుల తాకిడి పెరుగుతుండడంతో పునఃనిర్మాణం చేపట్టాలని ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి సంకల్పించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో ఆలయ పునఃనిర్మాణానికి నిధులు సమకూరాయి. సుమారు రూ.7 కోట్లపై పైగా వెచ్చించి ఆలయాన్ని అన్ని విధాలా భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి కమిటీ కృషి చేస్తోంది. ప్రస్తుతానికి ఆలయ మండపం భాగం, నాగాలమ్మ గోపురంను తొలగించే పనులు చేపట్టారు. మరో నాలుగు రోజుల్లో పాత ఆలయాన్ని తొలగించి, నూతన ఆలయ నిర్మాణానికి పనులను చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

ఎల్లప్పరెడ్డికి నివాళి


తూకాకుల ఎల్లప్పరెడ్డికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తూకాకుల ఎల్లప్ప రెడ్డి(75) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఆసుపత్రిలో మృతి చెందారు. మృతదేహాన్ని మండలంలోని అగరాల పంచాయతీ కుప్పిరెడ్డిపాళ్యానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ గ్రామానికి చేరుకున్నారు. ఎల్లప్పరెడ్డి భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, సర్పంచ్ భాస్కర్ రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల తయారీ ప్రారంభం


విగ్రహాల తయారీని ప్రారంభిస్తున్న నాయకులు

చంద్రగిరి: పర్యావరణ హితమే లక్ష్యంగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతి ఏటా ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్నారని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి తెలిపారు. స్థానిక నూకలగుంట వద్ద ఉన్న జగనన్న సమావేశ మందిరంలో శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలు తయారీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్ఫూర్తితో ఆయన తనయుడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మట్టి వినాయక విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో భాగంగా నిపుణులైన కళాకారులతో విగ్రహాలను తయారు చేయిస్తున్నామని వివరించారు. వైఎస్సార్ సీపీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, ఉప సర్పంచ్ నగరి చంద్ర, రాయలపురం సర్పంచ్ వెంకటయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మస్తాన్ పాల్గొన్నారు.

జీ20 సదస్సుపై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఆర్థిక శాస్త్ర, అధ్యయన శాఖ విద్యార్థులకు శుక్రవారం జీ 20 సదస్సుపై అవగాహన కల్పించారు. మహిళా అధ్యయన శాఖ ప్రొఫెసర్ పి.నీరజ మాట్లాడుతూ ఇండియా జీ 20 సదస్సు ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. ప్రతి విద్యార్థి సమకాలీన ఆర్థిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ప్రపంచ ఆర్థిక స్థితిగతులు, మార్కెట్, అంతర్జాతీయ సంబంధాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. ఆర్థిక రంగంలో మహిళా సాధికారత, సమాన వేతనం, ఉన్నత పదవులను అధిరోహించడానికి ఎలా కృషి చేయాలి అనే అంశాలపై పలువురు అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈఎస్ఐ వైద్యసేవల్లో తిరుపతి నంబర్ 1


మాట్లాడుతున్న డాక్టర్ నోయెల్ వినోద్

తిరుపతి తుడా: ఏపీలోని ఈఎస్ఐ ఆస్పత్రుల్లో తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యసేవల పరంగా ప్రథమ స్థానంలో ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం ఈఎస్ఐ ఆస్పత్రిలో ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ నోయెల్ వినోద్ అధ్యక్షతన ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు, అనంతపురం జిల్లాల వారు మెరుగైన ఫిజియోథెరపీ సేవలు ఇక్కడ పొందుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో అదనపు ఫిజియోథెరపిస్ట్‌ను నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సీనియర్ ఫిజియోథెరపిస్ట్ నోయెల్ వినోద్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ శిక్షణకు వస్తున్న రెండు ఫిజియోథెరపీ కళాశాలల విద్యార్థులతో రోగులకు త్వరితగతిన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఆర్థో స్పెషలిస్ట్‌లు రామకృష్ణ, శ్యాంబాబు, పాథాలజిస్ట్ డాక్టర్ రమేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ అమ్ములు, హెడ్ నర్స్ సరస్వతమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఇతర వైద్యులు, నర్సింగ్, వైద్య సిబ్బంది, ఫిజియోథెరపీ విద్యార్థులు జయవర్ధన్, గౌతమి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న శ్రీవారి చిత్రం

అలిపిరి నుంచి తిరుమల వెళ్లే నడక మార్గంలోని అక్కగార్ల ఆలయ సమీపంలో 50వ మలుపు వద్ద కొండ బండలపై చిత్రించిన శ్రీవారి చిత్రం భక్తులను ఆకట్టుకుంటోంది. నడిచి వెళ్లే భక్తులు ఆ చిత్రాన్ని ఫొటోలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



సారా ఊట ధ్వంసం

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లి సమీపంలో గల ఉప్పిలివంక అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన నాటుసారా ఊటను శుక్రవారం పోలీసులు ధ్వంసం చేశారు. చంద్రగిరి సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గిరిబాబు మాట్లాడుతూ అనుప్పల్లి సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఈసందర్భంగా 300 లీటర్ల నాటుసారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. పోలీసులు మదన్ మోహన్, ముజీబ్ రెహ్మాన్, ధనుంజయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ


పెళ్లి కానుక అందజేస్తున్న హేమేంద్ర కుమార్ రెడ్డి, పసల నాగరాజు

చంద్రగిరి: మండలంలోని మిట్టపాళెం పంచాయతీ సత్యసాయి ఎస్టీ కాలనీకి చెందిన శశి, ఢిల్లీ ప్రసాద్‌కు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని శుక్రవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అందజేశారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఒడిశా గవర్నర్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం ఒడిశా గవర్నర్ గణేషీలాల్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా, అధికారులు తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ వీఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చేసే పనిలో దేవున్ని చూడాలి


హెచ్‌ఎంని సత్కరిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పాకాల: మనం చేసే పనిలో దేవున్ని చూసినప్పుడే సంతృప్తి కలుగుతుందని ఎంఈవో బాబ్జీ తెలిపారు. పదిపుట్లబైలు ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హెచ్‌ఎం ప్రమీలమ్మను పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పని చేసినప్పుడు గుర్తింపు లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు వెంకటాచలం, సరితాకుమారి, మోహన్, యువరాజు, కేశవరావు, జ్యోతి, వెంకటస్వామి, సీఆర్పీలు శ్రీనివాసులు, మునికృష్ణ, కమిటీ చైర్మన్ లావణ్య, ఎంపీటీసీ మధు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం


వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

తిరుపతి కల్చరల్: రాస్ సేవా నిలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, అందరూ ఆనందకర జీవితాన్ని గడపాలని సూచించారు. కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ ఉమాపతి మాట్లాడుతూ రాస్ ద్వారా ఆర్థిక క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక క్రమశిక్షణ చక్కగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. అనంతరం మహిళలందరికీ పసుపు, కుంకుమ, చీరలు అందజేశారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల సంచాలకుడు వి.నాగరాజు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 20 మంది విద్యార్థులు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రసాయనశాస్త్ర విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న 20 మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఏటీజీసీ బయోటెక్నాలజీ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ కంపెనీ ప్రతినిధులు ఎస్వీయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ అభినందించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీరెడ్డి ఎస్వీయూ పూర్వ విద్యార్థి కావడం విశేషం.

నేడు హిందూ సమైక్య గర్జన ర్యాలీ

తిరుపతి కల్చరల్: భారతీయ సనాతన ధర్మాన్ని హేళన చేస్తూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం ఉదయం 9 గంటలకు తిరుపతిలో హిందూ సమైక్య గర్జన ర్యాలీ నిర్వహించనున్నట్టు హిందూ సమైక్య గర్జన సమితి కన్వీనర్ అనూష రామకృష్ణ తెలిపారు. ఆమె శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ర్యాలీ మహతి ఆడిటోరియం నుంచి అలిపిరి వరకు సాగుతుందన్నారు. ఇందులో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వసుంధర, జీఎస్.సుధారాణి, వసంత కృష్ణ, రాధాసురేష్, విమల పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ గురునాథ్ తెలిపారు. ఇందులో కేసుల పరిష్కారం కోసం ఏడు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాటికి అధ్యక్షులుగా తనతో పాటు తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.విజయసారథి రాజు, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, రెండు, మూడు, నాలుగు, ఐదు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల న్యాయమూర్తులు పల్లపోలు కోటేశ్వరరావు, సంధ్యారాణి, గ్రంథి శ్రీనివాస్, వై.సరిత వ్యవహరిస్తారని తెలిపారు. కేసుల పరిష్కారం కోసం న్యాయవాదులు, పోలీస్ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు సహకరిస్తారని పేర్కొన్నారు.

వందశాతం పంపిణీ చేయాలి


జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ అధికారి

తిరుపతి అర్బన్: టేక్‌హోం రేషన్ పంపిణీని అంగన్‌వాడీ కార్యకర్తలు సీరియస్‌గా తీసుకోవాలని, సెప్టెంబర్ లోపు వందశాతం పంపిణీ చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లాధికారి జయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితోపాటు రాష్ట్రస్థాయి అధికారులు పదేపదే టేక్‌హోం రేషన్ పంపిణీ పనితీరును పరిశీలిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్‌లోనూ ఆగస్టు నెలలో మాదిరే జిల్లాలోని బాలింతలు, గర్భిణులకు వందశాతం టేక్ హోం రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా రెండు విడతలుగా పంపిణీ చేస్తున్న క్రమంలో మొదటి విడత తప్పని సరిగా 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని, రెండో విడత 30వ తేదీకి పూర్తి కావాలని చెప్పారు. ఆ మేరకు జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,482 అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని చెప్పారు. ఈ కేంద్రాల పరిధిలో 12,290 మంది బాలింతలు, 12,538 మంది గర్భిణులున్నారని చెప్పారు. వీరందరికి 15 కిలోల బ్యాగ్‌లో 10 రకాల వస్తువుల కిట్ అందజేస్తామని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా చండీ హోమం


చండీ పారాయణంలో పాల్గొన్న భక్తులు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం పంచాయతీలోని పురాతన నెమిలిగుండ్ల శివాలయంలో శుక్రవారం చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేద పారాయణం, చండీ పారాయణం, చండీ హోమం, మంగళ హారతి తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం ధాన్యాధివాసం, నిత్య పారాయణ పూజా హోమాదులు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. భాకరాపేటకు చెందిన ఎస్.శ్రీరామచంద్ర శర్మ, ఎస్.శివత్రివిక్రమ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. శనివారం ఉదయం విగ్రహాలకు 108 కలశాల నీటితో అభిషేకం, తీర్థ ప్రసాద వినియోగం, మధ్యాహ్నం గ్రామోత్సవం, పంచశయ్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పాధివాసం, చత్రాధివాసం, దర్పణాధివాసం, పాదుకా ఫలాధివాసం, చతుర్వేద స్వస్తి మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు జరుగుతాయని ఎస్.శ్రీరామచంద్రశర్మ, ఎస్.శివత్రివిక్రమ శర్మ తెలిపారు.